క్లుప్తంగా

ఐటీఐ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కందుకూరు: కందుకూరు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ కాలేజీ)లో ఖాళీగా ఉన్న కోర్సుల్లో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎంవీ నాగేశ్వరరావు తెలిపారు. 10వ తరగతి ఆపై విద్యార్హత కలిగిన విద్యార్థులు www.iti.ap.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా ఈనెల 26వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకుని అనంతరం అప్లికేషన్ ఫారాన్ని ప్రింట్ తీసుకుని భద్రపర్చుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకోలేని విద్యార్థులు స్థానిక ఐటీఐ కాలేజీలో సంప్రదించవచ్చునని చెప్పారు. ఈ నెల 29వ తేదీన ఐటీఐ కాలేజీలో జరిగే కౌన్సెలింగ్‌కు విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

ఫిజియోథెరపీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కనిగిరి రూరల్: ప్రత్యేక అవసరాలు కల్గిన పిల్లలు భవిత కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఫిజియో థెరపి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ యువీ నారాయణరెడ్డి అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఫిజియోథెరపి శిబిరాన్ని ఆయన పరిశీలించారు. భవిత కేంద్రాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై ప్రత్యేక అవసరాలు కల్గిన పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు, ఐఈఆర్పీలకు సూచనలు చేశారు. డాక్టర్ జి.పుల్లయ్య వైద్య సేవలు అందించారు. ఐఆర్పీలు గోపాల కృష్ణ, సైమన్, హబీబా పాల్గొన్నారు.

పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

సీఎస్‌పురం(పామూరు): ఎస్టీ పాఠశాల ఏర్పాటుకు సంబంధించి నిర్మాణంలో ఉన్న నూతన పాఠశాల భవనం నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఈఓలు జే.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ భవనం సమీపంలో నిర్మిస్తున్న ఎస్టీ పాఠశాల భవన పనులను వారు సోమవారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం పాఠశాల మండల పరిషత్ కార్యాలయం పక్కన భవనంలో నిర్వహిస్తున్నందున విద్యార్థులకు కార్యాలయానికి వచ్చేవారితో ఇబ్బంది కలుగుతోందన్నారు. త్వరలో నూతన భవనంలోకి పాఠశాలను తరలిస్తామన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని వినతి

కనిగిరి రూరల్: పట్టణంలోని విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని డీఈఈ హరిబాబుకు సోమవారం మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ విద్యుత్ యజమాని విద్యుత్ యజమాని తనకు విద్యుత్ కనెక్షన్ వద్దని సర్వీసును తొలగించాలని చెప్పినా .. విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పట్టణంలో కొందరు అనధికార విద్యుత్‌ను వాడుతున్నారని ఆరోపించారు. ఒక స్తంభం నుంచి ఒక ఇంటికి సర్వీసు కనెక్షన్‌ను పొంది .. అనధికారికంగా చాలా ఇళ్లకు విద్యుత్ వాడుతున్నారన్నారు. విచారించి చర్యలు తీసుకుంటామని డీఈఈ తెలిపారు.

మున్సిపల్ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

కనిగిరి రూరల్: మున్సిపల్ స్థలాలు, ఆస్తులు, రోడ్లు, కాలువలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. సమస్య పరిష్కారంలో భాగంగా పట్టణంలోని 17వ వార్డులో సోమవారం పర్యటించారు. చైర్మన్ గఫార్ మాట్లాడుతూ మున్సిపల్ ఆస్తులు ఆక్రమణలకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం స్థానికులు పలు సమస్యలను చైర్మన్ గఫార్‌కు విన్నవించారు. కౌన్సిలర్ దేవకి రాజీవ్, శానిటరీ కార్యదర్శి ధూళిపాళ్ల రాజశేఖర్, డాక్టర్ రసూల్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న గుజ్జుల బాలిరెడ్డి

కనిగిరి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని రైతు సంఘం కనిగిరి డివిజన్ కార్యదర్శి గుజ్జుల బాలిరెడ్డి అన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు నాయకుడు జి.బాలిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. కౌలు రైతులందరికీ కౌలు కార్డులు అందచేయాలని, కౌలు రైతులకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని, వారిని సహకార పరపతి సంఘంలో సభ్యులుగా చేర్చాలని, కౌలు రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పేరం రఘునాథరెడ్డి, ఎస్‌కే ఖాశింపీరా, జి.తిరుపాలు, అంకయ్య, శ్రావణి, రామాంజమ్మ, అంకమ్మ, రాపూరి రమణమ్మ, ఆర్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో సర్కారు బడులు

"ఇంగ్లిష్ మీడియంతో ఏమొస్తుంది? మూడో తరగతి నుంచి టోఫెల్ అవసరమా?.." ఇవీ ప్రతిపక్షంలో ఉండగా నారా చంద్రబాబునాయుడు అండ్ కో మాట్లాడిన మాటలు. చంద్రబాబు కూటమి ప్రభుత్వం గద్దెనెక్కగానే సర్కారు విద్యను నిర్వీర్యం చేసే కుట్రలకు మరింత పదును పెడుతోంది. ఎన్నికల ప్రచారంలో "నీకు 15 వేలు.. నీకు 15 వేలు.. నీకు 15 వేలు.." అంటూ కూటమి నేతలు చెప్పిన మాటలు నమ్మి పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించారు. విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు దాటినా ఒక్క రూపాయి కూడా తల్లుల ఖాతాల్లో జమ కాలేదు. ఫీజులెలా కట్టాలో తెలియక తల్లిదండ్రులు తలపట్టుకుంటున్నారు. సర్కారు బడుల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం మౌనం దాల్చిన ప్రభుత్వం.. మధ్యాహ్న భోజన ఏజెన్సీలను టీడీపీ నేతలకు కట్టబెట్టే క్రమంలో నాణ్యతకు తిలోదకాలిచ్చింది.

- కొండపి నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలు 300
- గత విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య 22,336
- ఈ ఏడాది 1694 మంది ప్రైవేట్ స్కూళ్ల వైపు..
- తల్లికి వందనం అమలు చేయకపోవడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన
- పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై స్పందించని కూటమి సర్కారు
- నియోజకవర్గంలో 52 మందికి పైగా ఉపాధ్యాయుల కొరత

సింగరాయకొండ/టంగుటూరు/పొన్నలూరు/మర్రిపూడి/కొండపి(సింగరాయకొండ):
కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్య ఈ సంవత్సరం గణనీయంగా తగ్గింది. దీంతో ప్రైవేట్ పాఠశాలలు బలోపేతం అయ్యాయి. నియోజకవర్గంలో అన్ని రకాల ప్రభుత్వ పాఠశాలలు 300 ఉండగా గత విద్యా సంవత్సరంలో 22336 మంది విద్యార్థులు నమోదై ఉన్నారు. కానీ ఆ సంఖ్య ఈ ఏడాది 20642 మాత్రమే.. అంటే 1694 మంది విద్యార్థులు సర్కారు బడులకు దూరమయ్యారు. ఒక్క కొండపి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దాదాపు 150 మంది విద్యార్థులు తగ్గారు. కొండపి హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడు సహా కేవలం ఆరుగురే ఉపాధ్యాయులు బోధిస్తుండటం విద్యార్థుల సంఖ్య తగ్గడానికి కారణంగా తెలుస్తోంది.


మూలగుంటపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వాటర్ ప్లాంటు మూతపడ్డ దృశ్యం

ముందుకు సాగని సిలబస్

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ సజావుగా సాగకపోవడం, బదిలీలు నిలిపేయడంతో సిలబస్ ముందుకు సాగడం లేదు. సమ్మెటివ్ పరీక్షలు సమీపిస్తుండటంతో సిలబస్ పూర్తి కానిదే తామేమి రాయాలని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. సింగరాయకొండ మండలంలో 48 పాఠశాలలు ఉండగా ముగ్గురు పీఈటీలు, ఒక పీడీ, రెండు బయాలజీ, ఒక ఫిజికల్ సైన్స్, ఒక ఇంగ్లిష్, ఒక తెలుగు, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులు, టంగుటూరు మండలంలోని 56 స్కూళ్లలో 7 పోస్టులు, మర్రిపూడి మండలంలో 54 స్కూళ్లలో ఆరు టీచర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. జరుగుమల్లి మండలంలో 42 స్కూళ్లలో 4 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొండపి మండలంలో 49 స్కూళలో 24 మంది ఉపాధ్యాయుల అవసరం ఉంది. ఇదిలా ఉండగా నియోజకవవర్గంలోని 52 ఏకోపాధ్యాయ పాఠశాలల్లో టీచర్ సెలవు పెడితే ఇన్‌చార్జిలకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. దీంతో పాఠాల బోధన సజావుగా సాగడం లేదని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.

భోజనానికి తంటాలు

సింగరాయకొండ కొన్ని పాఠశాలలకు కోడిగ్రుడ్లు చిన్నవిగా ఉన్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. టంగుటూరు మండలంలో ఏడుగురు వంట కార్మికులను రాజకీయ కారణాలతో తొలగించారు. మర్రిపూడి మండలంలో 16 మంది వంట కార్మికులు, హెల్పర్లు 53 మందిని తొలగించి ఇష్టారీతిగా మెనూ అమలు చేస్తున్నారు. కొండపి మండలంలో 20 మంది వంట కార్మికులను తొలగించారు. దీంతో మధ్యాహ్న భోజనం పథకంలో నాణ్యత లోపించింది. కాగా స్వీపర్లకు ఫిబ్రవరి నుంచి, కుకింగ్ ఏజెంట్లు, హెల్పర్లకు ఏప్రిల్ నుంచి గౌరవ వేతనం అందడం లేదు. సింగరాయకొండ హైస్కూల్లో హెల్పర్లు లేకపోవడంతో విద్యార్థులే భోజనం వడ్డించుకుంటూ కనిపించారు.

మౌలిక వసతులపై మీన మేషాలు

సింగరాయకొండ మండలంలో మూలగుంటపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాకల, ఊళ్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో వాటర్ ప్లాంట్లు పనిచేయకపోవటంతో దాతల సహకారంతో మినరల్ వాటర్ తెచ్చుకుంటున్నారు. టంగుటూరు మండలం జమ్ములపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో త్రాగు నీటి కోసం బయట ఆర్వో ప్లాంట్ కి వెళ్లి త్రాగు నీటిని విద్యార్థులే వెళ్ళి బబుల్స్‌తో తీసుకొస్తున్నారు.

చదువులు తడబడి

- కూటమి ప్రభుత్వంలో సర్కారు పాఠశాలలపై నిర్లక్ష్యం
- తగ్గిన మధ్యాహ్న భోజనం నాణ్యత
- వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- సర్దుబాటు ప్రక్రియలో గందరగోళం

కనిగిరి రూరల్: సర్కారు బడులకు చంద్ర గ్రహణం పట్టింది. గత ప్రభుత్వంలో సర్కారు బడులకు జీవం పోయగా నేటి కూటమి ప్రభుత్వంలో సర్కారు బడులు చతికిల పడుతున్నాయి. పేద వర్గాల పిల్లలు చదువుకునే సర్కారు పాఠశాలల్లో విద్యా వ్యవస్థ తడబడుతుంది. పాఠశాలలో విద్యా కానుక కిట్లు పూర్తి స్థాయిలో అందలేదు. మధ్యాహ్న భోజనం నాణ్యత తగ్గిందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ పాఠశాలలపై నిర్లక్ష్యం కొనసాగుతోంది. దీంతో పాఠశాలల్లో సమస్యల గురించి పట్టించుకునే వారే కరువయ్యారు.

కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 458 వరకు ఉన్నాయి. కనిగిరి మండలంలో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది అడ్మిషన్ల సంఖ్య తగ్గింది. 19 పాఠశాలలు ఏకోపాధ్యాయులతో నడుస్తున్నాయి. చింతలపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు విద్యా కానుక కిట్‌లో బూట్లు రాలేదు. పాఠశాలలో ఆర్వో ప్లాంట్ మూలనపడేయడంతో మంచినీటిని బయట నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి. కొన్ని పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ రాలేదు.

నాణ్యత అంతంతమాత్రమే..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మధ్యాహ్న భోజన పథకం అమలులో నాణ్యతా, రుచికరంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. నిత్యావసర ధరలు పెరగడంతో మధ్యాహ్న భోజనంలో నాణ్యత అంతంతమాత్రంగానే ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

✦ పామూరు మండలంలో 24 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 18 మంది ఉపాధ్యాయుల కొరత ఉంది. విద్యా కానుక కిట్‌లు అందరికీ పంపిణీ చేయలేదు. కుకింగ్ ఏజెన్సీలను తొలగిస్తుండటంతో వారు కొంత ఆందోళన చెందుతూ మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించడంలేదు.

✦ సీఎస్‌పురం మండలంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు 15 ఉన్నాయి. శీలంవారిపల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు సెలవులో ఉండటంతో అక్కడ సీఆర్పీ షేక్ గౌసియాబేగం పాఠాలు బోధిస్తున్నారు. మండలంలో సర్దుబాటు ప్రక్రియలో భాగంగా 18 మందిని పాఠశాలలకు కేటాయించారు. అయితే సర్దుబాటు ప్రక్రియలో కొంత గందరగోళం ఉండటంతో విద్యా బోధన కుంటుపడుతోంది. జెడ్పీ పాఠశాలల్లో 38 పోస్టులు ఖాళీగా ఉండటంతో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది.

✦ హనుమంతునిపాడు మండలంలో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. ముప్పళ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితం, ఇంగ్లిష్, సోషల్ సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత ఉంది.


కనిగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూలన పడిన ఆర్వోప్లాంట్

ఎస్టీజీలను సర్దుబాటు చేయడంతో విద్యార్థులకు బోధన సక్రమంగా అందడం లేదు. నందనవనం, వాలిచర్ల పాఠశాలల్లోనూ ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. ఎలికవారిపల్లి, రక్షణాపురం, నీలకంఠాపురం ప్రాథమిక పాఠశాలల్లో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా సర్దుబాటులో ఒక్కొక్కరు ఉన్నారు. దీంతో విద్యార్థులకు విద్యాబోధన సక్రమంగా అందడం లేదు. విద్యా కానుక కిట్లను పూర్తిస్థాయిలో పంపిణీ చేయలేదు. మండలంలోని హనుమంతునిపాడు జిల్లా పరిషత్ పాఠశాల, సీతారాంపురం వాలిచర్ల జెడ్పీహెచ్‌ఎస్, కొత్త సీతారాపురం, లింగారెడ్డిపల్లి, కొండారెడ్డిపల్లి, దొడ్డిచింతల, వేములపాడు ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం కుకింగ్ ఏజెన్సీలను తొలగించారు.

✦ పీసీపల్లి మండలంలో 15 పాఠశాలల్లో ఏకోపాధ్యాయ బోధన జరుగుతుంది. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నాణ్యత తగ్గిందని విద్యార్థులు తెలిపారు. ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రకియలో కొంత గందరగోళం ఉంది. మండలంలో 95 కుకింగ్ ఏజెన్సీలు ఉండగా వాటిలో మూడు పాఠశాలల్లో ఏజెన్సీలను మార్చారు.

✦ వెలిగండ్ల మండలంలో 12 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. మండలంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. నాగులవరం జెడ్పీ హైస్కూల్లో 400 మంది విద్యార్థులు ఉన్నారు. మొత్తం 18 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా 9 మంది మాత్రమే ఉన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటులో భాగంగా 8 మంది ఉపాధ్యాయులను రోల్ ఎక్కువగా ఉండే పాఠశాలలకు సర్దుబాటు చేశారు. రామగోపాలపురం(జనరల్), మొగళ్లూరు (సీపీ) పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. మండలంలో 10 పాఠశాలల్లో కుకింగ్ ఏజెన్సీలను మార్చారు. రామగోపాలపురం పాఠశాలకు విద్యార్థులెవ్వరూ రాకపోవడంతో ఉపాధ్యాయుడు మధ్యాహ్నం నుంచి తాళం వేసి వెళ్లిపోయారు.

ఆరంభంలోనే అగచాట్లు

కందుకూరు: ప్రభుత్వ పాఠశాలలు రాజకీయాలకు వేదికగా మారుతున్నాయి. ప్రభుత్వం మారడంతో అధికారాన్ని అడ్డంపెట్టుకుని అడ్డదారిలో పెత్తనం చెలాయించేందుకు అధికార పార్టీ నాయకులు కుయుక్తులు పన్నుతున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలో పిల్లల విద్యా ప్రమాణాలు దెబ్బతింటాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే సందర్భంలో విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, బూట్లు వంటి పంపిణీ చేయడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. గత ప్రభుత్వంలో పాఠశాలలు ప్రారంభం కానే విద్యార్థులకు అవసరమైన పుస్తకాల దగ్గర నుంచి యూనీఫాం దుస్తులు, విద్యాసామగ్రి ఇలా ప్రతి ఒక్కటీ అందేదని, కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని తల్లిదండ్రులు అంటున్నారు.

కందుకూరు మున్సిపాలిటీ, మండల పరిధిలో మొత్తం 71 పాఠశాలలున్నాయి. 2024-25 సంవత్సరంలో 4978 మంది విద్యార్థులు ప్రస్తుతానికి ఉన్నారు. గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం తీసుకురావడంతోపాటు, సీబీఎస్‌ఈ సిలబస్, ఐఎఫ్‌బీ ప్యానల్స్ వంటి చర్యల వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతుందని పలువురు ఉపాధ్యాయులు చెప్తున్నారు. లింగసముద్రం మండలంలో 575 మంది విద్యార్థులకు బూట్లు ఇవ్వలేదు. ఈ 575 మంది విద్యార్థుల సైజ్‌కు అనుగుణంగా బూట్లు లేకపోవడంతో వచ్చిన వాటిని వెనక్కి పంపారు. తిరిగి ఇప్పటి వరకు ఆ విద్యార్థులు బూట్లు ఇవ్వలేదు. మండలంలోని మేదరమెట్లపాలెం పాఠశాలలో కేవలం ఆరుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారని, కానీ అక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో వారిని త్వరలోనే సర్దుబాటు చేస్తామని విద్యాశాఖ అధికారులు చెప్తున్నారు.

కుకింగ్ ఏజెన్సీలపై ఒత్తిళ్లు

ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నబోజనం సరఫరా చేసే కుకింగ్ ఏజెన్సీలపై అధికార పార్టీ నాయకులు జులుం ప్రదర్శిస్తున్నారు. కుకింగ్ ఏజెన్సీలను ఇష్టారీతిన మార్చేస్తున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న వారిపై ఒత్తిడిలు తెచ్చి తప్పుకోవాలని బెదిరింపులకు దిగుతున్నారు. కందుకూరు మున్సిపాలిటీ, మండల పరిధిలో ఇప్పటి వరకు 20 కుకింగ్ ఏజెన్సీలను లింగసముద్రంలో47కు గాను 22 ఏజెన్సీలను, వలేటివారిపాలెంలో 50 ఏజెన్సీల్లో 39 ఏజెన్సీలను ఇప్పటికే మార్చివేశారు. ఈనెల 8 స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికలు ఉండడంతో ప్రస్తుతానికి కుకింగ్ ఏజెన్సీల తొలగింపు ప్రక్రియ నిలిచిపోయింది. అయితే ఆ తరువాత మిగిలిన ఏజెన్సీలు కూడా తప్పుకోవాల్సిందేనంటూ అధికార పార్టీ నేతలు హుకుం జారీ చేస్తున్నారని, ఏళ్లుగా తాము కుకింగ్ ఏజెన్సీలుగా పనిచేస్తున్నా అక్రమంగా తొలగిస్తున్నారంటూ నిర్వాహకులు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


విద్యార్థులు రాకపోవడంతో తాళం వేసి వెళ్లిపోయిన ఉపాధ్యాయుడు



శీలంవారిపల్లె ఎంపీపీఎస్‌లో విద్యాబోధనచేస్తున్న సీఆర్‌పి

ఉలవపాడు : మండలంలో విద్యా కానుక కిట్లు మరికొందరికి అందాల్సి ఉంది. ఉలవపాడులోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో సోషల్ టీచర్ లేక ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది ఈ విషయం విద్యాశాఖ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ దృష్టికి రాగా వెంటనే సర్దుబాటు చేశారు. కానీ ఈ ఏడాది ఆ విషయం గురించి విద్యాశాఖ పట్టించుకోలేదు. కానీ మండలంలో ముగ్గురు ఉపాధ్యాయులు అధికంగా ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. వారిని సర్దుబాటు చేస్తామని అంటున్నారు. మధ్యాహ్నభోజన పథకంలో కుకింగ్ ఏజెన్సీలు రాజకీయ నాయకుల నుంచి ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నారు.

విద్యాకానుక కిట్లు మా పిల్లలకు ఇంకా అంద లేదు


పిల్లలిద్దరూ జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. విద్యాకానుక కిట్లు మా పిల్లలకు ఇంకా అంద లేదు. పాఠ్యపుస్తకాలు కూడా ఇవ్వలేదు. దీంతో పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం బయట కొనుగోలు చేయాల్సి వచ్చింది. గత ఏడాది పాఠశాలలు ప్రారంభం కాగానే ఇచ్చారు. ఈ ఏడాది అంతా గందరగోళంగా ఉంది.

– ఉస్తేల రవి, కొండారెడ్డిపల్లి

ప్రభుత్వ పాఠశాలలపై శ్రద్ధ పెట్టాలి


పామూరు ప్రభుత్వ ఉన్నతపాఠశాలతో పాటు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. సర్దుబాటు కింద ఉపాధ్యాయులను నియమిస్తుండటంతో కొంత గందరగోళం ఉంది. కుకింగ్ ఏజెన్సీలను మారుస్తుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

– ఓగూరి ఏడుకొండలు, పామూరు

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం


అన్నెబోయినపల్లెలో తల్లులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు


నాగిరెడ్డిపాలెంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రమాదేవి

లింగసముద్రం: పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు తాగిస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని పెదపవని సెక్టార్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి అన్నారు. మండలంలోని అన్నెబోయినపల్లో-1, అంగిరేకుల పాడు అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన అరగంటలోపు బిడ్డకు తల్లిపాలు పట్టించాలని సూచించారు. తద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలన్నారు. ఏఎన్‌ఎం హెప్సిక, ఎంఎస్‌కే మహిమ, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పామూరు: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంవీఎస్ పార్వతి అన్నారు. మండలంలోని వగ్గంపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకత, పౌష్టికాహార ఆవశ్యకతను వివరించి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

వలేటివారిపాలెం: మండలంలోని పోకూరు అంగన్వాడీ సెంటర్‌లో సెక్టార్ సూపర్‌వైజర్ రుబీనా ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

ముర్రుపాలు బిడ్డ ఆరోగ్యానికి మంచిది

పొన్నలూరు: తల్లి ప్రసవించిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు ఇవ్వడం వలన ఆరోగ్యకరంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు.


పామూరులో అవగాహన ర్యాలీ

మండలంలోని నాగిరెడ్డిపాలెం అంగన్‌వాడీ సెంటర్‌లో సోమవారం తల్లిపాల వారోత్సవం కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొర్రపాటి మమత, అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మావతి, సత్యవతి గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

మర్రిపూడి: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, బిడ్డపుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు తాగించాలని వైద్యాధికారి విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని కూచిపూడి గ్రామంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భిణులు బలవర్థక ఆహారం తీసుకున్నప్పుడే ఆరోగ్య కరమైన బిడ్డకు జన్మనిస్తారన్నారు. బిడ్డ పుట్టిన అరగంటలోపు తల్లి పాలు తాగించాలన్నారు. తల్లి తన బిడ్డకు ముర్రుపాలు పట్టించినప్పుడే వ్యాధినిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతంగా ఎదుగుతారన్నారు. వారి వెంట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుచరిత, ఏఎన్‌ఎం, ఆశాలు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

సీఎస్‌పురం(పామూరు): కేంద్ర వార్షిక బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ అన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఎస్. తిరుపతిరెడ్డి అధ్యక్షతన సీపీఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి హనీఫ్ మాట్లాడుతూ బడ్జెట్‌లో ఏపీకి ప్రత్యేకహోదా, పోలవరం, విశాఖ రైల్వేజోన్ తదితర అంశాలకు బడ్జెట్‌లో ఊసేలేదన్నారు. కార్పొరేట్‌లకు రాయితీలు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం పేదలను విస్మరించిందన్నారు. బడ్జెట్‌లో ఉపాధి పథకానికి, ఆహార భద్రత పథకాలకు నిధులు తగ్గించారని దుయ్యబట్టారు. పార్టీ మండల కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు, ఎం.రత్నారెడ్డి, ఎస్‌కే.అజీద్‌బాషా, నాయకులు పాల్గొన్నారు.

నూతన తహశీల్దార్‌గా జ్వాల నరసింహారావు

మర్రిపూడి: మండల నూతన తహశీల్దార్‌గా మిడసల జ్వాల నర్శింహారావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా గుంటూరు జిల్లాలో పనిచేస్తున్న జ్వాల నర్శింహారావు బదిలీపై మర్రిపూడి వచ్చినట్లు తెలిపారు. మర్రిపూడిలో పనిచేసిన సుందరమ్మ నెల్లూరు జిల్లా కొండాపురానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన తహశీల్దార్ జ్వాల నర్శింహారావును రెవెన్యూ సిబ్బంది శాలువాలతో సత్కరించి, బోకేలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కేఆర్ భూపతి, వీఆర్‌ఓలు, సామేలు, కృష్ణ, సందీప్, వేణు, ఏబేలు, నర్శింహారావు, ఏడుకొండలు, సర్వేయర్‌లు పాల్గొన్నారు.

ఉలవపాడు: తహసీల్దార్‌గా వి.లావణ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

వలేటివారిపాలెం: తహసీల్దార్‌గా షేక్ అబ్దుల్ హమీద్ సోమవారం భాద్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.


నూతనంగా బాధ్యతలు తీసుకున్న తహశీల్దార్‌ను అభినందిస్తున్న రెవెన్యూ సిబ్బంది

హనుమంతునిపాడు: తహసీల్దార్‌గా బి .దిలీప్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కార్యాలయ సిబ్బంది, వీఆర్‌ఓలతో సమీక్షించారు. రెవెన్యూ పనులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. డీటీ కిషోర్‌రెడ్డి, సర్వేయర్ రమణయ్య, సహాయ సర్వేయర్లు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

పొగాకు సరాసరి ధర కేజీ రూ.289.28

కొండపి (సింగరాయకొండ): కొండపిలోని స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో పొగాకు సరాసరి ధర కేజీ రూ.289.28 పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. సోమవారం నిర్వహించిన వేలంలో కట్టువారిపాలెం, నర్సింగోలు గ్రామాలకు చెందిన రైతులు 1075 బేళ్లు వేలానికి తీసుకొని రాగా అందులో 952 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 123 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.కేజీ 360, కనిష్ట ధర రూ.205 పలికింది. వేలంలో 18 కంపెనీల వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

913 పొగాకు బేళ్ల కొనుగోలు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలోని సోమవారం జరిగిన వేలంలో 913 పొగాకు బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. ఆలకూరపాడు, అనంతవరం, రావివారిపాలెం, జయవరం, పాలేటిపాడు గ్రామాలకి చెందిన రైతులు 980 బేళ్లు వేలానికి తీసుకురాగా వాటిలో 913 కొనుగోలు చేశారు. 67 బేళ్లు తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358 కాగా, కనిష్ట ధర రూ.205, సరాసరి రూ.305.30 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 45 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

అన్ని గ్రేడులకు మంచి ధరలు అందించాలి:

వ్యాపారులు అన్ని గ్రేడులకు మంచి ధరలు అందించాలని ఒంగోలు ప్రాంతీయ అధికారి ఎం.లక్ష్మణరావు అన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రాన్ని సోమవారం పరిశీలించి రైతులకు పలు సూచనలిచ్చారు. రైతులు పచ్చిరొట్ట పంటలైన జనుము, జీలుగు, నువ్వులు పంటలను వేయడం వల్ల ఉపయోగాలు, లాభాలను వివరించారు. అనధికారిక బ్యార్నీలు నిర్మించరాదని తెలిపారు. బోర్డు వారు అనుమతించిన మేరకే పొగాకు పంట సాగు చేయాలన్నారు.

డిగ్రీ ఫలితాల్లో టీఆర్‌ఆర్ విద్యార్థుల ప్రతిభ

కందుకూరు: ఆంధ్రకేసరి యూనివర్శిటీ డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాల్లో టీఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ వవిద్యార్థులు విజయభేరి మోగించారని ప్రిన్సిపాల్ ఎం రవికుమార్ తెలిపారు. పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, స్పెషల్ తెలుగు సబ్జెక్టుల్లో నూరుశాతం ఉత్తీర్ణ సాధించారని, స్పెషల్ ఇంగ్లిషులో 93శాతం, హిస్టరీలో 89 శాతం, కెమిస్ట్రీలో 80శాతం, బోటనీలో 73శాతం, మేథమేటిక్స్‌లో 64శాతం, డేటా సైన్స్‌లో 71శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎస్‌కే సైదాబి అనే విద్యార్థినీ ఫండమెంటల్స్ ఆఫ్ అకౌంట్స్‌లో 80, ఉర్దూలో 86, కామర్స్ ఓఏటీలో 74 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిందని చెప్పారు. ఆర్ మహేష్, కె. నాగేంద్రబాబులు స్పెషల్ తెలుగులో 96 , శివకుమార్, జైస్వాల్‌లు ఇంగ్లిష్‌లో 92, కెమిస్ట్రీలో అశ్విని 89 మార్కులు, సి. ప్రోగ్రామింగ్‌లో డి.హరిత 72 మార్కులు, డేటాసైన్స్‌లో ఏ బాలచెన్నమ్మ 86 మార్కులు, హిస్టరీ, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టుల్లో ఎం చిన్నబాబు 86మార్కులు, ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో వై శృతి అత్యధిక మార్కులు సాధించి టాపర్స్‌గా నిలిచారని వివరించారు.

శాస్త్రీయ పద్ధతులు అవలంబించండి

లింగసముద్రం: విరపనారు పెంపకంలో శాస్త్రీయ పద్ధతులు అవలింబించడం ద్వారా నాణ్యమైన మొక్కలు పెంచుకోవచ్చని కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త హెడ్ డాక్టర్ జి.ప్రసాద్‌బాబు అన్నారు. లింగసముద్రంలోని అంబేడ్కర్‌నగర్‌లో ఎస్సీ రైతులకు మిరపనారు పెంపకంపై శిక్షణ ఇచ్చారు. మిరప పంట వేసే పొలాల్లో జనుము లేదా జీలుగ వంటి పచ్చిరొట్ట పైర్లను చల్లుకుని పూతదశలో నాగళ్లతో కలియదున్నడం ద్వారా నేలలో సేంద్రీయ కర్బణం పెరిగి అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటేష్, డాక్టర్ జ్యోతి, ఇంజనీర్ వివేక్, మైరాడా ఎన్‌జిఓ సభ్యులు పాల్గొన్నారు.